

సిర్నాపూర్ కోటకు సొబగులు

మోపాల్ మండలంలోని సిర్నాపూర్ కోటకు నుడా నుంచి రూ. 50 లక్షలు కేటాయించారు. దీంతో అభివృద్ధి జరగనుంది.

- 8లో ▸



ఉపసర్పంచ్‌పై చర్యలేవి..?

ఉపసర్పంచ్ తమ భూమిని కబ్జా చేసి బెదిరిస్తున్నాడని తొండాకూర్‌కు చెందిన కుటుంబం నిరసన తెలిపింది.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
29.1 /24.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వరకు చిరుజల్లులతో కూడిన వర్షం కురియవచ్చు. సాయంత్రం మోస్తరు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న జెండా బాలాజీ ఉత్సవాలు

నిజామాబాద్ సిటీ: నగరంలోని జెండా బాలాజీ మందిరంలో జెండా ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నమయ్య సంకీర్తనలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ యాదిరెడ్డి ఆలయానికి విచ్చేసి, స్వామివారిని దర్శించుకుని, జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జాలిగం గోపాల్, ఆలయ ఈవో వేణు జేసీకి స్వాగతం పలికారు. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పూజలు చేశారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్ పరిశీలన



నిజామాబాద్ నాగారం : నగరంలోని ఖలీల్‌వాడిలోని ఆర్ఆర్ఆర్(రెడ్యూస్, రీయూజ్, రిసైక్లింగ్)సెంటర్‌ను శనివారం మున్సిపల్ కమిషనర్ మంద మకరందు పరిశీలించారు. సెంటర్‌లో ఉన్న సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులకు, ప్రజలకు ఆర్ఆర్ఆర్ గురించి వివరించారు. ఉపయోగం లేని వస్తువులు బుక్స్, దుస్తులు, షూ, బ్యాగ్‌లు తదితర వస్తువులు ఇక్కడ ఉంచాలన్నారు. అవసరం ఉన్న వాటిని ఎవరైనా తీసుకెళ్లవచ్చన్నారు. ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజిత్‌అలీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

జీవో.142ను రద్దు చేయాలి



నిజామాబాద్‌నాగారం : వైద్యరోగ్యశాఖలో జీవో 142ను రద్దు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు శనివారం మెడికల్ అండ్‌హెల్త్ ఎంప్లాయీస్ ఫోరం అధ్యక్షులు కొప్పు పార్థసారథి ఆధ్వర్యంలో విన్నవించారు. టీఎన్జీవోస్ కేంద్ర సంఘం పిలుపు మేరకు జిల్లాలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుదర్శనం, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పోశెట్టి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల శ్రావణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ కల్యాణి పాల్గొన్నారు.

కాకతీయకాలువ ద్వారా పెరిగిన నీటి విడుదల..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు శనివారం పెంచారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 7140 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 540 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090.80(89.21 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

'సాగర్' గేటు ఎత్తివేత

నిజాంసాగర్ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలవల్ల శనివారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు 1,405 అడుగుల(17.8 టీఎంసీలు)తో నిండుకుండలా ఉంది. దీంతో ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని ఒక గేటు ఎత్తి మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు.

చారిత్రక గణపతులు

జిల్లాలో దశాబ్దాలుగా గణనాథులను భక్తితో కొలుస్తున్నారు. నగరంలో మార్వాడి సంఘ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండలికి విశిష్ట ఖ్యాతి ఉంది. అప్పటి మార్వాడీలు నిజాంకాలంలో రజాకార్లను ఎదురించి గణేశ్ నవరాత్రులను ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేసిన గణేశ్ మండళ్లకు ఒక్కో చరిత్ర ఉంది. కొలువైన గణనాథ మండపాలపై ప్రత్యేక కథనం..



రాజస్థానీ సేవా సమాజ్ సంఘ్ ఆధ్వర్యంలో మార్వాడి నవయువక్ గణేశ్ మండలి



రజాకార్లను ఎదురించి గణనాథుడి ప్రతిష్ఠ

- 1931లో రాంప్రసాద్ జీ తివాడి గోశాలలో ఏర్పాటు
- మార్వాడీల ఐక్యతతో నిరాటంకంగా గణేశ్ ఉత్సవాలు

నిజామాబాద్ సిటీ: మార్వాడి సంఘ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే గణేశ్ మండలికి ఓ ప్రత్యేక గుర్తింపు కలిగి ఉంది. నిజాం కాలంలో రజాకార్లను ఎదుర్కొంటూ మార్వడీలు గణేశ్ నవరాత్రుల ఉత్సవాలను ఏర్పాటు చేశారు. 1931లో నిజామాబాద్‌లో మొదటిసారిగా గోశాలలో గణేశ్‌ను రాజస్తానీ సేవా సమాజ్ వ్యవస్థాపకుడు రాంప్రసాద్ జీ తివాడి ప్రతిష్ఠించారు. ఆయనకు భగవాన్ దాస్ మాల్, దామోదర్ జోషి, ఘన్‌శ్యాం తోత్ల, ఘన్‌శ్యాం పాండే, కనయ్యాలాల్ లాగ్ల, బాల్ కిషన్ బజాజ్, కుషారాం గయా, గోపికిషన్ బోరే, రాంనివాస్ మాల్, సుఖ్‌దేవ్ సొడా, ఓం తివారీ, నిర్మల్ చంద్ జైన్, గజానంద్ శర్మ, ఓం మోదాని, రాజ్‌గోపాల్ అట్టల్, కిషన్ అట్టల్, సత్‌నాన్ తోత్ల, గౌరిశంకర్ జాజీలు జత కట్టారు. అప్పుడు జిల్లా కేంద్రంలో మార్వడీలు 150 కుటుంబాలు మాత్రమే ఉండేవి. నాడు ప్రారంభించిన ఉత్సవాలు రాజస్థానీ సేవా సమాజ్ సంఘ్ ఆధ్వర్యంలో మార్వడీ నవయువక్ గణేశ్ మండలి వారసులు 92 ఏళ్లుగా కొనసాగిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఒక్కో రకమైన సెట్టింగ్ జిల్లా ప్రజలను ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ సంవత్సరం లంకలో సీతాదేవి ఉంటే సముద్రం దాటి అక్కడికి వెళ్లేందుకు శ్రీరాముని సైన్యానికి హనుమంతుడు, వానరులు సముద్రంలో బండ రాళ్లు వేసి రామసేతును నిర్మిస్తారు. ఆ సెట్టింగ్‌ను అద్భుతంగా వేయటంతో తిలకించేందుకు ప్రజలు నిత్యం తరలివస్తున్నారు.

విశిష్టత కలిగిన స్వయం భూ గణనాథుడు

- బోధన్‌లో పూజలందుకుంటున్న సంకట విమోచన గణపతి

బోధన్‌రూరల్(బోధన్) : బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రాంతంలోని మున్సిపల్ తాగునీటి శుద్ధీకరణ కేంద్ర ప్రాంగణంలో స్వయంభుగా వెలిసిన శ్రీ సంకట విమోచన గణపతి ఆలయం భక్తుల కోర్కెలు తీర్చే ఆలయంగా ప్రసిద్ధి చెందుతోంది. వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా భీమునిగుట్ట సార్వజనిక్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే గణేశ్ మండలానికి ఈ ఉత్సవ విగ్రహాన్ని తీసుకెళ్లి పూజలు నిర్వహించి రథయాత్ర నిర్వహించి తిరిగి ఉత్సవవిగ్రహాన్ని ఆలయంలో పునఃప్రతిష్ఠిస్తారు. ఆరు దశాబ్దాల క్రితం సంకట విమోచన స్వయంభు విగ్రహానికి ఆలయాన్ని నిర్మించడంతో భక్తులు పెరిగారు. 2015లో ఆలయ అభివృద్ధి కోసం ఆలయానికి పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు.



రాకాసిపేట్‌లోని స్వయం భూ గణపతి ఆలయం

రద్దీ పెరిగింది



దాతలు, భక్తుల సహకారంతో ఆలయాన్ని సుందరీకరణ పనులు చేపట్టి అభివృద్ధి చేశాం. చవితి ఉత్సవాల్లో భాగంగా కార్యక్రమాలు చేపాడుతున్నాం.
– శ్రీకాంత్ దేశాయి, ఆలయ కమిటీ చైర్మన్, బోధన్




32 ఏళ్లుగా కొలుస్తూ..

డిచ్‌పల్లి(నిజామాబాద్ రూరల్) : డిచ్‌పల్లి మండల కేంద్రంలో సార్వజనిక్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో 32 ఏళ్లుగా క్రమం తప్పకుండా వినాయకుడి విగ్రహం ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. 1991లో తొలుత 8 మంది కమిటీగా ఏర్పడి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడిని ప్రతిష్ఠించారు. అప్పటినుంచి ఇప్పటిదాకా ప్రతి ఏటా క్రమం తప్పకుండా సార్వజనిక్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో వినాయకుడు భక్తుల పూజలందుకుంటున్నారు.

73 ఏళ్లుగా..

- రుద్రూర్‌లో ఘనంగా వినాయక ఉత్సవాలు
- నిమజ్జనం రోజు తెల్లవార్లు సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రత్యేక ఆకర్షణగా గడ్డి ఏనుగు

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలో గత 73 ఏళ్లుగా వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. 1950లో సార్వజనిక్ గణేష్ మండలి ఏర్పాటు చేశారు. స్థానిక శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయంలో తొలి గణనాథున్ని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించారు. నాటి నుండి ప్రతి యేటా వైభవంగా నిర్వహిస్తున్నారు. 50 ఏళ్లుగా ఆరె కటికె సంఘం ఆధ్వర్యంలో గడ్డి ఏనుగు తయారు చేసి తీసుకు వస్తున్నారు. శోభాయాత్రలో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పద్మశాలీలు, నాయిబ్రాహ్మణులు తమ వృత్తి నైపుణ్యతతో ప్రదర్శనలు ఇస్తారు. వినాయక ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడంలో 25 ఏళ్లుగా ఉత్సవ కమిటి అధ్యక్ష, కార్యదర్శులుగా ఉంటున్న చిదుర వీరేశం, గెంటిల సాయిలు కృషి ఎంతో ఉంది. వినాయక ఉత్సవాల సందర్భంగా సేకరించిన విరాళాలు పొదుపు చేసి నూతన ఆలయాన్ని నిర్మించారు. రూ. 20 లక్షలు ఎండోమెంట్‌లో చెల్లించి .. రూ.32లక్షలతో సుందరంగా పక్కపక్కనే శ్రీ విఠలేశ్వర స్వామి, శ్రీ వినాయక ఉత్సవ మందిరం నిర్మించారు.



రుద్రూర్‌లోని సార్వజనిక్ గణేశ్ మండలి వినాయకుడు



నిమజ్జన శోభాయాత్ర కోసం తయారు చేసిన గడ్డి ఏనుగు

ఆర్మూర్ క్షత్రీయ సమాజ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడు



చక్రి భజన ప్రత్యేకం

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని చిన్న బజార్‌లోని లక్ష్మీనారాయణ మందిరంలో క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో 70ఏళ్లకు పైగా వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేస్తున్నారు. ప్రతి ఏడాది సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహిస్తారు. ప్రతిరోజు ఉదయం రాత్రి వినాయకుడికి ప్రత్యేక పూజలను నిర్వహించి అందులో భాగంగా చక్రిభజన చేయడం ఆనవాయితీగా వస్తుంది. నవరాత్రి ఉత్సవాల్లో 11 రోజుల పాటు చక్రిభజన కార్యక్రమం చేయడం జిల్లాలోనే ఓ ప్రత్యేకత. అలాగే శోభాయాత్ర నిర్వహించిన రోజు పట్టణంలోని ప్రధాన కూడలిల వద్ద చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరు ఈ చక్రిభజనలో పాల్గొంటారు. నిమజ్జనం రోజు క్షత్రీయ సమాజ్ కులస్తులు చేసే చక్రి భజన కార్యక్రమానికి చూడానికి ప్రజలు పెద్దఎత్తున తరలివస్తారు. శ్రీ లక్ష్మీనారాయణ మందిరంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపడతారు.

ఆర్యవైశ్య గణేశుడికి ఘన చరిత్ర

- 1944లో స్థాపించిన ముక్కా అయోధ్యరాం గుప్తా
- ప్రతి సంవత్సరం ఆకర్షణీయమైన సెట్టింగ్ ఏర్పాటు
- నాటి నుంచి నేటివరకు విగ్రహ దాత ధన్‌పాల్ కుటుంబమే..

నిజామాబాద్ సిటీ: నగరంలోని ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న గణేశ్ మండలికి ఘన చరిత్ర ఉంది. ప్రతి సంవత్సరం ఆర్యవైశ్య గణేశుడిని దర్శించుకునేందుకు లక్షలాది మంది తరలివస్తారు. ప్రతి సంవత్సరం భారతీయ చరిత్ర, సంస్కృతిని తెలిపే విధంగా ఒక్కో రకమైన సెట్టింగ్స్ వేస్తారు. వీటిని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. 1944 సంవత్సరం అంటే స్వాతంత్ర్యానికి మూడు సంవత్సరాల ముందు ఆర్యవైశ్య గణపతిని నగరానికి చెందిన ముక్కా అయోధ్యరాం గుప్తా నెలకొల్పారు. నగరంలోని కిషన్ గంజ్‌లో నిర్మించిన ఆర్యవైశ్య సంఘంలో దీనిని ఏర్పాటు చేశారు. నాటి నుంచి ఆర్యవైశ్య సంఘం సభ్యులు దీనిని నిరంతరంగా కొనసాగిస్తున్నారు. నిత్యం వ్యాపారంలో బిజీగా ఉండే వైశ్యులు గణేశ్ నవరాత్రుల్లో ఒకేచోట చేరి ఘనంగా నిర్వహిస్తారు. ఆర్యవైశ్య గణేశ్ మండలికి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది.

విగ్రహ దాత ధన్‌పాల్ కుటుంబమే..

1944 సంవత్సరంలో ఆర్యవైశ్య గణేశ్ మండలి ఏర్పాటు కాగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తాత ధన్‌పాల్ విఠల్ గుప్తా గణేశ్ ప్రతిమ దాత. నాటి నుంచి నేటి వరకు గణపతి ప్రతిమను ధన్‌పాల్ కుటుంబమే దాతగా వ్యవహరిస్తున్నారు. తాత, తండ్రి అనంతరం ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా వారి అడుగు జాడల్లో నడుస్తూ ప్రతి ఏడాది విగ్రహాన్ని కొనిస్తున్నారు. గణపతి దర్శనంతో పాటు ప్రత్యేక సెట్టింగ్‌లు నిర్వహిస్తుంటారు. ఆకర్షణీయమైన సెట్టింగులు చేస్తుండడంతో ఈ మండలి ప్రత్యేక గుర్తింపు పొందుతోంది.



విగ్రహం ఎదుట సంజీవని పర్వతాన్ని ఎత్తుకొస్తున్న హనుమాన్ సెట్టింగ్

చరిత్ర తెలిపేలా సెట్టింగ్‌లు



ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీ వైశ్య సేవా సంఘం గణేశ్ మండలి 79 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ప్రతి సంవత్సరం భారతీయ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు ఈ తరానికి తెలిపేందుకు సెట్టింగ్స్‌లు వేస్తుంటాం. ఈ ఏడాది రామాయణంలో యుద్ధంలో లక్ష్మణుడికి బాణం తగిలితే హన్మంతుడు సంజీవని పర్వతాన్ని తీసుకొచ్చే సెట్టింగ్ చేశాం. ఇప్పటి వరకు సంస్కార భారతి నుంచి 15 అవార్డులు అందుకున్నాం. సంఘంలోని ప్రతి సభ్యుడు పదవులు అనుభవించాలన్న ఉద్దేశంతో ప్రతి ఏడాది కమిటీలో కొత్తవారికి చోటిస్తాం.
–ఇల్లెందుల ప్రభాకర్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ
- సెక్టోరల్ అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ సత్యనారాయణ సూచించారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఎన్నికల సెక్టోరల్ అధికారులకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. వారికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. వివరాలతో కూడిన హ్యాండ్‌బుక్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో నెలకొన్న పరిస్థితులు, సమస్యాత్మక కేంద్రాల వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత మూడు రోజుల్లోపు తుది నివేదిక అందించాలన్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేలా నగదు, మద్యం, మత్తు పదార్థాలు పంపిణీ కాకుండా నిఘా ఉంచాలన్నారు. అత్యవసరమైతే తప్ప సెలవులు తీసుకోకూడదన్నారు. పోలీస్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును మొహరిస్తామన్నారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మకరందు, అదనపు డీసీపీలు జయరాం, గిరిరాజా, ఆర్డీఓలు, ఏఆర్ఈఓలు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో ఉమ్మడి తనిఖీలు

ఎన్నికల సందర్భంగా జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలలో ఉమ్మడి తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. పోలీస్ కమిషనర్‌తో కలిసి సంబంధిత శాఖల జిల్లా ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ శనివారం సమీక్ష నిర్వహించారు. 2018 ఎన్నికల నుంచి గత ఎన్నికల వరకు ఉన్న సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సమీక్షలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు భంగపాటు

- గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష రెండోసారి రద్దు
- ప్రిపరేషన్‌కు మోయలేని ఆర్థికభారం
- భగ్గుమంటున్న నిరుద్యోగులు

జిల్లాలో గ్రూప్-1 అభ్యర్థుల వివరాలు

మొదటిసారి పరీక్ష తేదీ	16-10-2022
దరఖాస్తుదారులు	12,858
హాజరైన వారు	9,990
రెండోసారి పరీక్ష తేదీ	11-6-2023
హాజరైన వారు	7,957



నిజామాబాద్ అర్బన్/డిచ్‌పల్లి: టీఎస్పీఎస్సీ వ్యవహరిస్తోన్న తీరు నిరుద్యోగుల పాలిట శాపంగా మారింది. అభ్యర్థులతో బయోమెట్రిక్ తీసుకోలేదని, ఓఎంఆర్ షీట్లపై హాల్ టికెట్ల నంబర్లు లేవనే ఉద్దేశంతో గ్రూప్–1 ప్రిలిమినరి పరీక్షను తాజాగా హైకోర్టు రద్దు చేసింది. రెండోసారి రద్దు కావడంతో అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది అక్టోబర్ 16న మొదటిసారి గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష జరగగా, ఏడాది జూన్ 11న రెండోసారి పరీక్షలు నిర్వహించారు. అంతా సవ్యంగా సాగుతున్న తరుణంలో ఫలితాల కోసం వేచి చూస్తున్న అభ్యర్థులకు తీరని భంగపాటు ఎదురైంది. రెండోసారి కూడా గ్రూప్–1 పరీక్షను రద్దు చేస్తూ శనివారం హైకోర్టు తీర్పునిచ్చింది. దీంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

రెండోసారి పరీక్షలోనూ తేడాలు..

టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎట్టకేలకు టీఎస్పీఎస్సీ ద్వారా గ్రూప్–1 పరీక్ష నిర్వహణకు గతేడాది నిర్ణయం తీసుకుంది. అయితే రాష్ట్రంలో టీఎస్పీఎస్సీ నిర్వహించిన ఏఈఈ, డీఏవో పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకై నట్లు అధికారులు గుర్తించి విచారణ చేయగా గ్రూప్–1 ప్రిలిమినరి కూడా లీకైనట్లు గుర్తించి రద్దు చేశారు. తిరిగి పరీక్ష నిర్వహించారు. అయితే అందులోనూ తేడాలు జరిగినట్లు గుర్తించిన హైకోర్టు రెండోసారి గ్రూప్–1ను రద్దు చేశారు. దీంతో కొన్ని నెలలుగా ఫలితాల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులు ఆగ్రహావేశాల్లో ఉన్నారు.

అప్పులు చేసి చదివినా..?

గ్రూప్–1కు సంబంధించి అభ్యర్థులు ఎంతో కష్టపడి ఏడాదికాలంగా ప్రిపరేషన్ అవుతున్నారు. వివిధ కోచింగ్ సెంటర్లలో రూ. వేలల్లో ఫీజులు కడుతూ.. ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటూ చదువుకున్నారు. వస్తువులు తాకట్టు పెట్టి కోచింగ్‌లకు ఫీజులు చెల్లించారు.

నిరుద్యోగులతో ఆటలు



నేను గ్రూప్ -1 ప్రిలిమ్స్ క్వాలిఫై అయ్యా. మెయిన్స్‌కు ప్రిపేరవుతున్న సమయంలో పేపర్ లీక్ అంటూ రద్దు చేశారు. ప్రస్తుతం హైకోర్టు రద్దు చేసింది. ఇలా ఎవరో ఒకరు తప్పు చేస్తే వేలాదిమంది అన్యాయం జరుగుతోంది.
– పిట్ల సరిత, గ్రూప్–1 అభ్యర్థి

ప్రభుత్వ నిర్లక్ష్యమే..



నిరుద్యోగులతో తెలంగాణ ప్రభుత్వం వ్యవహరించిన నిర్లక్ష్య ధోరణితో హైకోర్టు గ్రూప్–1 పరీక్షను రద్దు చేసింది. కేసీఆర్ ప్రభుత్వం మొదటి నుంచి ఉద్యోగుల భర్తీ విషయంలో మోసపూరితమైన వైఖరితో ఉంది.
– కల్యాణి, గ్రూప్–1 అభ్యర్థి

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి. విద్యార్థులను ఇలా ఎన్నిసార్లు మోసం చేస్తారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత మద్యం నోటిఫికేషన్ తప్ప ఏ నోటిఫికేషన్ సక్రమంగా జరగలేదు.
– గజేందర్, గ్రూప్–1 అభ్యర్థి

బోర్డును రద్దు చేయాలి



హైకోర్టు తీర్పుతో టీఎస్పీఎస్సీ గ్రూప్–1 పరీక్షలు రద్దు కావడంతో మళ్లీ పరీక్షలకు వెళ్లాలంటే ఏడాది పాటు చదవాల్సిందే. ఇప్పటికే పేపర్ లీకేజీ, బయోమెట్రిక్ లేదనే కారణాలతో రెండుసార్లు పరీక్షలు రద్దయ్యాయి. బోర్డు రద్దు చేసి కొత్త బోర్డును నియమించాలి.
–హంగర్గ విశాల్, గ్రూప్–1 అభ్యర్థి, కోటగిరి

క్లుప్తంగా

బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం



మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా నుంచి బాలుర విభాగంలో 13 టీంలు, బాలికల విభాగంలో 11 టీంలు పాల్గొన్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబురావు అధ్యక్షత వహించగా సర్పంచ్ చింత మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి రమణ, బాల్ బ్యాడ్మింటన్ సంఘం కోశాధికారి రాజేశ్వర్, కార్యదర్శి కృష్ణమూర్తి, సంజీవ్, మాధురి, భారతి, కాలేవార్ రాజు పాల్గొన్నారు.

ఐకేపీ ఉద్యోగుల సర్టిఫికెట్ల పరిశీలన



డొంకేశ్వర్(ఆర్మూర్): ఐకేపీ సెర్ప్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం పే స్కేల్ అమలు చేస్తున్న నేపథ్యంలో శనివారం గ్రామీణాభివృద్ధి శాఖలో సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. సెర్ప్ శాఖ ఆదేశాల మేరకు డీపీఎంలు ఈ ప్రక్రియ చేపట్టారు. జిల్లాలో మొత్తం 216 మంది సెర్ప్ ఉద్యోగులున్నారు. పే స్కేల్ వర్తించాలంటే ప్రభుత్వం సూచించిన విద్యార్హతలు ఉండాలి. డీపీఎంలు, ఏపీఎంలకు పీజీని అర్హతగా పరిగణించారు. ఎల్-1 క్లస్టర్ కో-ఆర్డినేటర్లకు ఇంటర్, ఎల్-2 క్లస్టర్ కో-ఆర్డినేటర్లకు డిగ్రీ, ఎంఎ సీసీలకు, ఇతర కిందిస్థాయి సిబ్బందికి పదో తరగతిని అర్హతగా నిర్ణయించారు. అయితే ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లను డీపీఎంలు పరిశీలించగా, ఈ నెల 27న మరోసారి ఉద్యోగుల సర్టిఫికెట్ల పరిశీలన హైదరాబాద్‌లో జరగనుంది.

ముగిసిన గురుకుల స్పాట్ అడ్మిషన్లు



డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించి శనివారం నిర్వహించిన స్పాట్ అడ్మిషన్లు ప్రశాంతంగా ముగిసినట్లు సంస్థ నిజామాబాద్ ఆర్‌సీవో అలివేలు తెలిపారు. నిజామాబాద్ రీజియన్ పరిధిలోని డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గురుకుల పాఠశాలల ఆవరణలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలోని ఖాళీ సీట్లకు 277 మంది బాలురు, 217 మంది బాలికలు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్..





పర్యావరణాన్ని కాపాడే రీతిలో ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ, యువజన సంఘాల మండపాలు, ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు సంబంధించి 'సాక్షి' సెల్ఫీలు ఆహ్వానిస్తోంది. ఆసక్తి గలవారు వినాయక ప్రతిమలతో సెల్ఫీలు దిగి కింది నంబరుకు వాట్సప్ చేయగలరు.

పంపించాల్సిన వాట్సప్ నెం. 8978036828



గంగ రుత్విక్‌నందన్, ఇందల్వాయి



శివపుత్ర గణేశ్ మండలి, దుబ్బ



కార్తీక్, హరిణి, దేవాన్ష్, మామిడిపల్లి



గడ్డం చిన్నారెడ్డి, గాదేపల్లి



సరేష్, వనజ, పోచమ్మగల్లి



పవన్‌కుమార్, నిజామాబాద్



శ్రీ సచ్చిదానంద గణేశ్ మండలి, కంఠేశ్వర్



శశి, ఆర్మూర్




హేమంత్, గడ్కోల్



శివపుత్ర గణేశ్ మండలి, ఈస్ట్ బ్యాంక్ కాలనీ

సిర్పూర్ కోటకు సొబగులు



సిర్పూర్ కోట



కోటను పరిశీలిస్తున్న బాజిరెడ్డి (ఫైల్)

- రూ.50 లక్షల నుడా నిధులతో అభివృద్ధి పనులు
- పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేలా ఏర్పాట్లు
- నేడు భూమిపూజ చేయనున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

మోపాల్: మోపాల్ మండలంలోని సుమారు 250 ఏళ్ల చరిత్ర గల సిర్పూర్ కోట కొత్త సొబగులు సంతరించుకోనుంది. కోట పూర్వ వైభవానికి నుడా నుంచి రూ.50 లక్షలు మంజూరు చేశారు. 70 ఏళ్లుగా కోట సమీపంలో ఎలాంటి కార్యకలాపాలు జరగకపోవడంతో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో శిథిలావస్థకు చేరింది. బురుజులు, లోపల నిర్మాణాలు పూర్తిగా కూలిపోయే దశకు చేరాయి. రాజు, వారి కుటుంబసభ్యులు నివసించిన గదులు ఇప్పటికే నేలమట్టమయ్యాయి. దీంతో కోటకు పూర్వ వైభవం తీసుకు రావాలని గ్రామస్తుల కోరిక మేరకు నిధులు మంజూరు చేశారు. సిర్పూర్ కోట చరిత్ర ఈ తరం ప్రజలకు తెలియజేసేలా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. స్థానిక సర్పంచ్ సామ ముత్యంరెడ్డి విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రతిపాదనల మేరకు నుడా నుంచి రూ.50లక్షలు మంజూరు చేశారు. శతాబ్దాల చరిత్రకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచే ఈ కోటకు పూర్వవైభవం తీసుకొచ్చేలా పనులు చేపట్టనున్నారు. కోట అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆదివారం భూమిపూజ చేయనున్నారు. పలు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. కోటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే కోట పరిసరాల్లో పిచ్చిమొక్కలు తొలగించారు.

ఆర్టీసీ చైర్మన్‌కు కృతజ్ఞతలు



సిర్పూర్ కోటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయించిన ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. ఎన్నో ఏళ్లుగా ఎవరూ కోట గురించి ఆలోచన చేయలేదు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు కేటాయించేందుకు కృషి చేశారు. కోట అభివృద్ధితో గ్రామానికి కొత్త కళ వస్తుందని ఆశిస్తున్నాం.

– సామ ముత్యంరెడ్డి, సర్పంచ్, సిర్పూర్

న్యాయం కోసం వెళ్తే.. కన్నేశాడు

- డబ్బులు ఇప్పించాలని ఠాణాకు వెళ్లిన మహిళ
- వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్న కానిస్టేబుల్
- ఆత్మహత్యకు యత్నించిన బాధితురాలు
- సస్పెండ్ చేసిన పోలీసు కమిషనర్

నిజామాబాద్ రూరల్: న్యాయం కోసం ఠాణాకు వెళ్లిన మహిళను లోబర్చుకొని వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు ఓ పోలీస్. ఈ విషయం భర్తకు తెలియడంతో మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు.. నిజామాబాద్ నగరంలోని వర్ని రోడ్డుకు చెందిన మహిళ రూ.ఐదు లక్షలకు కారు అమ్మింది. కొన్న వ్యక్తి కొన్ని డబ్బులు ఇవ్వగా, మిగతా డబ్బుల కోసం ఇబ్బంది పెట్టాడు. దీంతో బాధితురాలు రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. ఆమె గోడును ఓ కానిస్టేబుల్‌కు చెప్పింది. సదరు మహిళ భర్త హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. దీంతో ఒంటరిగా ఉన్న ఆమెతో ఆ కానిస్టేబుల్ చనువుగా ఉంటూ.. మిగతా డబ్బులు ఇప్పిస్తానని చెప్పి రెండు మద్యం బాటిళ్లు, రూ.ఐదు వేలు తీసుకున్నాడు. ఇంతటితో ఆగకుండా ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం భర్తకు తెలియడంతో ఠాణాకు వెళ్లి పోలీస్ అధికారికి చెప్పాడు. పోలీస్ అధికారులు నచ్చజెప్పి సయోధ్య కుదిర్చారు. అయినా భర్త అనుమానంతో ఆమెను శారీరకంగా వేధిస్తుండటంతో బాధితురాలు ఇటీవల పురుగుల మందు తాగింది. సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడింది. ఈ విషయమై నిజామాబాద్ రూరల్ ఠాణా ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఘటన జరిగింది వాస్తవమేనని అన్నారు. ఇరువురి మధ్య సయోధ్య కుదరడంతో కేసు నమోదు కాలేదన్నారు. కాగా విషయం సీపీ దృష్టికి వెళ్లడంతో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి స్థాయి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఏసీపీ కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు.

ఓపెన్ ప్రవేశాల గడువు పొడిగింపు

నిజామాబాద్‌అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ ప్రవేశాల గడువు పొడిగించినట్లు కో ఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30 వరకు గడువు పొడగించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో స్టడీ సెంటర్‌కు రావాలన్నారు. వివరాలకు 7382929612 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

25న జబ్‌మేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు 25న సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఉద్యోగ మేళా ఉంటుందన్నారు. జిల్లాలో ప్రముఖ క్రెడిట్ అక్సెస్ గ్రామీణ కంపెనీలో రిలేషన్షిప్ మేనేజర్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల ఉండి ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని వివరించారు. మరిన్ని వివరాల కోసం 9581768413, 6305743423, 9959456793 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

స్నేహ సొసైటీలో వైద్యశిబిరం

నిజామాబాద్‌నాగారం: మానసిక, శారీరక దివ్యాంగులకు ఏళ్ల తరబడిగా నిస్వార్థంగా సేవలందిస్తున్న స్నేహ సొసైటీ ప్రతినిధులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ సంకేత, బధిరుల దినోత్సవం సందర్భంగా శనివారం మారుతీనగర్‌లోని స్నేహ సొసైటీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. హెల్త్ క్యాంపులో వైద్యపరీక్షలు నిర్వహించి మందులు, పరికరాలు ఉచితంగా అందజేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, మహిళా కమిషన్ సభ్యురాలు సుదం లక్ష్మి, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కోర్డినేటర్ కిరణ్మయి, వైద్యులు మైత్రేయి, శిల్ప, సాయిజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి సునీత

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని టోకరా

బాన్సువాడ రూరల్: క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. మండలంలోని బుడిమి గ్రామానికి చెందిన చిలుక సాయిలు ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయనకు ఈ నెల 6న ఓ వ్యక్తి ఫోన్ చేసి క్రెడిట్ లిమిట్ పెంచుతామని చెప్పాడు. క్రెడిట్ కార్డుకు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఫొటో లింక్ చేయాల్సి ఉంటుందని చెప్పాడు. దీని కోసం ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పమనగా సాయిలు సైబర్ నేరగాడు చెప్పినట్లే చేశాడు. దీంతో క్రెడిట్ కార్డు నుంచి రూ.9,875, రూ.9,356, రూ.1,852 విత్‌డ్రా అయినట్లు మెసెజ్ వచ్చింది. వెంటనే సదరు నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో మోసపోయినట్లు గుర్తించి 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో రూ.9,356 హోల్డ్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీనిపై శనివారం బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

ఉపసర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన బాధిత కుటుంబం

డొంకేశ్వర్(ఆర్మూర్): ఉప సర్పంచ్ రాజేందర్ తమ భూమిని ఆక్రమించడమే కాకుండా బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఆరోపిస్తూ డొంకేశ్వర్ మండలం తొండాకూర్‌కు చెందిన బాధిత కుటుంబం శనివారం తహసీల్ కార్యాలయానికి వచ్చింది. తమను రక్షించి భూమిని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆఫీసు ముందు బైఠాయించారు. బాధితుడు గజ్జెల సతీష్ మాట్లాడుతూ... తొండాకూర్ సర్వే నంబరు 205/1లో మొత్తం ఆరు గుంటల భూమిని గుండంపల్లి చిన్న రాజన్న దగ్గర కొన్నేళ్ల క్రితం తాము కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఉప సర్పంచ్ రాజేందర్ తన పదవిని అడ్డుపెట్టుకుని భూమిని కబ్జా చేశాడని ఆరోపించారు. స్థలంలో అక్రమంగా భవనం నిర్మిస్తున్న విషయాన్ని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. సర్వే చేయడానికి అధికారులు కూడా సహకరించడం లేదని వాపోయారు. భవన నిర్మాణాన్ని అడ్డుకోవడానికి వెళ్తే ఉప సర్పంచ్ బెదిరింపులకు పాల్పడుతున్నాడని, తమ కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ఇదే విషయమై శుక్రవారం తొండాకూర్ గ్రామ పంచాయతీ వద్ద నిరసన తెలుపగా కొందరు బెదిరించారని ఆరోపించారు.

ముంచిన నకిలీ విత్తనాలు

- నష్టపోయిన మొక్కజొన్న రైతులు
- కంకులు ఏర్పడినా గింజలు రాని వైనం



గింజలు రాని మక్క కంకులు

మోర్తాడ్(బాల్కొండ): నకిలీ విత్తనాలతో మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. మొక్కజొన్న కోత దశకు చేరుకోగా పంటను కోసే ప్రయత్నంలో మక్కలు మొలవలేదని గుర్తించి రైతులు కంగు తింటున్నారు. కంకి బాగానే పెరిగినా క్షుణ్నంగా పరిశీలిస్తే గింజలు జీవం పోసుకోలేదు. దీనికి నకిలీ విత్తనాల బెడదనే కారణం అని రైతులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం సీజనుకు గాను జిల్లాలో దాదాపు 35వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. పసుపులో అంతర్ పంటగా మొక్కజొన్నను ఎక్కువగా సాగు చేసిన రైతులు తమకు జరిగిన నష్టంపై ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న పంటకు కంకి పెరిగినా ఆ కంకిని పరిశీలిస్తే మక్కలు మాత్రం రాలేదు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, మెండోరా, ముప్కాల్, బాల్కొండ, ఆర్మూర్, నందిపేట్, ఆలూర్, జక్రాన్‌పల్లి మండలాల్లో మొక్కజొన్న పంట ఎక్కువ సాగైంది. అనేక చోట్ల కంకి పెరిగినా ఆ కంకికి మక్కలు లేకపోవడంతో తాము నకిలీ విత్తనాలతో నిండా మునిగిపోయామని రైతులు వాపోతున్నారు. జిల్లాలో దాదాపు 5వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నకిలీ విత్తనాలతో నష్టం వాటిల్లింది. నకిలీ విత్తనాలను, వాటిని సరఫరా చేసిన వ్యాపారులను గుర్తించక పోవడంతో మోసగాళ్లకు ఆడింది ఆటగా పాడింది పాటగా మారిపోయిందనే అభిప్రాయం వ్యక్తమైతుంది. నకిలీ విత్తనాలను విక్రయించిన వ్యాపారులతో పాటు విత్తన కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి



నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ప్రభు త్వం ఆదుకోవాలి. నకిలీ విత్తనాలను సరఫరా చేసి న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

– సోమ పెద్ద రాజారెడ్డి, సర్పంచ్, దిశ కమిటీ సభ్యులు, గుమ్మిర్యాల్

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి యువకుడి గల్లంతు



ఓల్లెపు రాజేశ్

నాగిరెడ్డిపేట: మండలంలోని గోపాల్‌పేట సమీపంలోని కాశిరెడ్డికుంటలో చేపలు పట్టేందుకు వెళ్లి ఓ యువకుడు గల్లంతయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. గోపాల్‌పేటకు చెందిన ఓల్లెపు రాజేష్(27) శుక్రవారం తన స్నేహితుడు బూర్గుపల్లి బాల్‌లింగంతో కలిసి కాశిరెడ్డికుంటలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో రాజేశ్ ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యాడు. బాల్‌లింగం ద్వారా తెలుసుకున్న కుటుంబీకులు కుంట వద్దకు వెళ్లి గాలించారు. శుక్రవారం రాత్రయినా అతని ఆచూకీ లభించకపోడవంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. శనివారం ఉదయం ఎల్లారెడ్డి అగ్నిమాపక సిబ్బంది కాశిరెడ్డికుంటకు చేరుకొని స్థానిక జాలర్ల సహాయంతో రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినా రాజేష్ జాడ దొరకలేదు. ఈ విషయమై నాగిరెడ్డిపేట ఎస్సై రాజును సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

సాగర్ కాలువలో మృతదేహం

రుద్రూర్: రుద్రూర్ మండలం రాయకూర్ శివారులోని నిజాంసాగర్ కాలువలో శనివారం మృతదేహం లభ్యమైంది. సాగర్ కాలువలో చెట్టుకు తట్టుకొని ఉన్న మృతదేహాన్ని గుర్తించిన రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు మండలంలోని చిక్కడపల్లి గ్రామానికి చెందిన యాదయ్యగా పోలీసులు గుర్తించారు. యాదయ్యకు మతిస్థిమితం లేదని, రెండు రోజులుగా గ్రామంలో కన్పించడం లేదని గ్రామస్తులు తెలిపారు. కాలకృత్యాలకు వెళ్లి కాలువలో పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాత రాజంపేట సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ ప్రాంతంలో శనివారం వేకువజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. వయసు 45 ఏళ్ల వరకు ఉంటుందని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. రోడ్డు పక్కన మృతదేహం పడి ఉందన్నారు.

ఒకరి అదృశ్యం



శంకర్

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లికి చెందిన గంగారాజుల శంకర్ అదృశ్యమైనట్లు ఎస్సై భాస్కరా చారి తెలిపారు. శంకర్ ఈ నెల 20న గణేశ్ మండపం వద్దకు వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. ఇప్పటి వరకు ఇంటికి తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. ఆయన భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురి అరెస్ట్

కామారెడ్డి క్రైం: మహారాష్ట్ర నుంచి కామారెడ్డికి రైలులో గంజాయి సరఫరా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో పట్టణ పోలీసులు శనివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. వివరాలు.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ ప్రాంతం నుంచి కామారెడ్డికి రైలులో గంజాయి సరఫరా జరుగుతుందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో డీఎస్పీ ప్రకాశ్, పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. కామారెడ్డి రైల్వే పోలీస్ స్టేషన్‌లో దిగగానే రామాయంపేటకు చెందిన నవీన్, కామారెడ్డికి చెందిన పృథ్వీ, నందును అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కామారెడ్డి పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో నివసించే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి రవాణా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

బోధన్‌రూరల్: సాలూర మండలం హున్సా శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. ఈ దాడిలో 11 మందిని అరెస్టు చేసి రూ.44,860 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పెద్ద ఎడ్గి శివారులో..

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం పెద్ద ఎడ్గి శివారులో పేకాట స్థావరంపై శనివారం సాయంత్రం జుక్కల్ ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.2,400 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై చెప్పారు.

ఉపాధ్యాయుల ప్రాధాన్యత ధ్రువపత్రాలను పరిశీలించాలి

కామారెడ్డి టౌన్: పదోన్నతులు, బదిలీల కోసం ప్రాధాన్యత విభాగంలో పాయింట్ల కోసం ఉపాధ్యాయులు సమర్పించిన సర్టిఫికేట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం డీఈవో ఎస్ రాజుకు వినతిపత్రం అందజేశారు. కొందరు ఉపాధ్యాయులు తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించారని, దివ్యాంగులుగా అర్హత లేకున్నా కొందరు వైద్యులతో 70 శాతం దివ్యాంగులుగా ఉన్నట్లు సర్టిఫికేట్లు సమర్పించారని వారు ఆరోపించారు. ఇలాంటి వారిని మళ్లీ ప్రత్యక్షంగా వైద్యాధికారులతో పరీక్షించి అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు. అలాగే 2018 బదిలీలలో ఉపయోగించుకున్న ప్రిఫరెన్షియల్ కేటగిరీ లిస్టును బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి విజయశ్రీ పాల్గొన్నారు.

ఫైనాన్స్ వ్యాపారిపై దాడి



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నిజామాబాద్‌రూరల్: ఫైనాన్స్ వ్యాపారిపై నలుగురు దాడి చేసి గాయపర్చారు. వివరాలు.. మండలంలోని ఖానాపూర్‌కు చెందిన అలగొండ అబ్బన్న ఫైనాన్స్ వ్యాపారం చేస్తాడు. ఆయన గతంలో కాలూర్ గ్రామానికి చెందిన నలుగురికి అప్పు ఇచ్చాడు. అంతేగాకుండా వారు అబ్బన్న దగ్గర పదేళ్ల క్రితం ఇన్సూరెన్స్ కోసం ప్రిమియం చెల్లించారు. అబ్బన్న వారిని బాకీ డబ్బులు అడిగితే ఇవ్వలేదు. ఈ క్రమంలో శనివారం అబ్బన్న నిజామాబాద్ రాగా గమనించిన సదరు వ్యక్తులు ఖానాపూర్ వెళ్దామని ఆటోలో ఎక్కించుకున్నారు. అనంతరం గిరిరాజ్ కళాశాల వైపు ఆటోను మళ్లించి కర్రలతో తీవ్రంగా కొట్టారని బాధితుడు తెలిపారు. అబ్బన్న ఫిర్యాదు మేరకు మూడో టౌన్ ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు.

చిన్నారులపై కుక్కల దాడి

- ఇద్దరికి గాయాలు

నందిపేట్: నందిపేటలో కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. నందిపేటలోని పాత ఐవోబీ భవనం ఎదురుగా గ్రామానికి చెందిన అక్షున్ అనే మూడేళ్ల బాలుడిపై కుక్కలు దాడి చేసి చేయికి గాయపరిచాయి. పక్కనున్న వారు కుక్కలను తరిమి వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అలాగే బస్టాండ్ ప్రాంతంలో బోధన్‌కు చెందిన రెండున్నర ఏళ్ల కె శైలేష్‌పై కుక్కలు దాడి చేశాయి. గాయపడిన చిన్నారులకు స్థానిక పీహెచ్‌సీలో వైద్యం అందించారు.